(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్) మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాలు ఉత్సవశోభ సంతరించుకున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలుచోట్ల ఇప్పటికే ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయాలను విద్యుత్ దీపాలతో ముస్తాబుచేశారు. నల్లగొండ జిల్లాలోని పురాతనమైన పానగల్లు పచ్చల సోమేశ్వరాలయం, ఛాయాసోమేశ్వరాలయం, సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం నాగులపహాడ్‌లోని త్రికూటేశ్వరాలయం, చారిత్రక కళాసంపదకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. దామరచర్ల మండలం వాడపల్లిలోని మీనాక్షి అగస్త్యేశ్వరస్వామి, శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయాలను భక్తులు అధికసంఖ్యలో దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. దక్షిణకాశిగా పిలిచే మేళ్లచెర్వులోని శివాలయం, నేరేడుచర్ల మండలంలోని సోమప్ప దేవాలయం, నార్కట్‌పల్లి మండలంలోని జడల రామలింగేశ్వరాలయాలు శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్నాయి. గురువారం ఆలయంలో లక్ష్మీగణపతి హోమం, రుద్రహోమం, పూర్ణాహుతి వంటి పూజలు నిర్వహించారు. 8వతేదీన పార్థివ లింగానికి ఉదయం 3.30 గంటల నుంచి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని పచ్చల సోమేశ్వమేశ్వరస్వామి, వీటీకాలనీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, తులసీనగర్ భక్తాంజనేయ స్వామి ఆలయం, షేర్ బంగ్లాలోని సంతోషిమాతా ఆల యాల్లో శివరాత్రి సందర్భంగా అభిషేకాలు, కల్యాణం, అర్చనలు నిర్వహించనున్నారు.

● యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం రెడ్లరేపాకలోని భవానీ శంకరస్వామి ఆలయాన్ని ముస్తాబుచేశారు. శుక్రవారం మహాస్వామికి రుద్రాభిషేకం, ధ్వజారోహణం, నిత్యహోమాలు, రాత్రి 10గంటలకు శ్రీ భవానీ శంకర స్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

● నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని నిడమనూరు, ముప్పారం, వెంగన్నగూడెం, తుమ్మడం, మార్లగడ్డ గ్రామాల్లోని శివాలయాలు ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. శివరాత్రికి ఒకరోజు ముందుగానే కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. శుక్రవారం రుద్రాభిషేకం, మధ్యాహ్నం అన్నదానం నిర్వహిస్తారు.

● నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కమలాపూర్ వీరభద్రస్వామి దేవాలయం, దేవరకొండ పట్టణంలోని శివాలయం, నందీశ్వర ఆలయం, మార్కెండేయస్వామి దేవాలయాలను ముస్తాబుచేశారు. కమలాపూర్‌లో శివరాత్రి నుంచి శ్రీభద్రకాళి వీరభద్రస్వామి దేవాలయంలో ఈనెల 15వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈనెల 11న రథోత్సవం జరుగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

● యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలం మహదేవ్‌పూర్ గ్రామంలో చారిత్రక నేపథ్యం కలిగిన అక్కన్న మాదన్న ఆలయాల్లో కొలువైన వేణుగోపాలస్వామి, ఉమామహేశ్వర స్వామి ఆలయాల్లో ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. మోత్కూరులోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయాన్ని ముస్తాబు చేశారు.

● సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని తొగర్రాయి శ్రీభ్రమరాంబిక మల్లిఖార్జున స్వామి దేవాలయం, కాపుగల్లులోని శ్రీనాగేంద్ర స్వామి, కూచిపూడిలోని ఉమామహేశ్వర స్వామి ఆలయాలను ముస్తాబు చేశారు.

● అర్వపల్లి మండలంలోని పర్సాయపల్లి, బొల్లంపల్లి, జాజిరెడ్డిగూడెం, కొమ్మాల గ్రామాల్లో శివాలయాలను ముస్తాబు చేశారు.

● నడిగూడెం మండలం వల్లాపురం శివారు గుట్టపై బాలకోటేశ్వరస్వామి ఆలయం ఉత్సవాలకు ముస్తాబైంది.ఖమ్మం, సూర్యాపేట జిల్లాల మధ్య గల ఆలయం కావడంతో రెండు జిల్లాల జాతరగా ప్రసిద్ధి చెందింది.

● యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి, సంస్థాన్‌నారాయణపురం, వలిగొండ, మోటకొండూర్, చౌటుప్పల్ మండలాల్లోని ఆలయాలను ముస్తాబు చేశారు.

● నల్లగొండ జిల్లా అనుముల మండలం పేరూరులోని సోమేశ్వరస్వామి ఆలయాన్ని సుందరంగా ముస్తాబుచేశారు.

శివరాత్రి వేడుకలకు బస్సు సౌకర్యం


భక్తుల కోసం ఉచిత బస్సులు ప్రారంభిస్తున్న ట్రస్మా నాయకులు

నల్లగొండ కల్చరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని నల్లగొండ జిల్లా కేంద్రం శివారు పానగల్లులోని ఛాయసోమేశ్వర ఆలయంలోని ముక్కంటి దర్శనానికి హాజరయ్యే భక్తులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ట్రస్మా జిల్లా సెక్రటరీ జీవిరావు తెలిపారు. పట్టణంలోని పాఠశాల ఆవరణలో ఉచిత బస్సుల రవాణా సౌకర్యాన్ని గురువారం జెండా ఊపి ప్రారంభించారు. పిల్లలు, వృద్ధులు, మహిళలు స్వామివారిని దర్శించుకునే విధంగా ఉచిత బస్సుల సౌకర్యం కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, పట్టణాధ్యక్షుడు ఆజీజ్, భిక్షం, రవి, పర్వతరెడ్డి, మనోహర్, లక్ష్మణ్, పద్మ, స్పందన పాల్గొన్నారు.

కొండెక్కిన పండ్లు, పూల ధరలు

భువనగిరి టౌన్: భువనగిరిలోని ఆలయాలను ముస్తాబు చేశారు. పచ్చలకట్ట సోమేశ్వరాలయాన్ని వేలాది మంది భక్తులు సందర్శించనున్న నేపథ్యంలో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు. భారీ కేడ్లు నిర్మించి చలువ పందిళ్లు వేశారు. పట్టణంలోని దక్షిణేశ్వర స్వామి, భవానీ రామలింగేశ్వర, కాలభైరవ, ఆజాద్ రోడ్డు, బ్రాహ్మణవాడ, శివాలయాలతో పాటు పట్టణంలోని అన్ని ఆలయాల్లో శివరాత్రి వేడుకలు నిర్వహించనున్నారు. భక్తులు ఉపవాస దీక్షలు, జాగరణ చేయనున్నారు. ఆలయాల్లో రోజంతా పూజలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శివరాత్రి పురస్కరించుకొని పట్టణంలో పండ్లు, పూజా సామాగ్రి విక్రయాలు పెరిగాయి. దీంతో పండ్ల ధరలు పెరిగిపోయాయి.

'పేట'లో ఆలయాలు ముస్తాబు


అన్నపూర్ణ సహిత విశ్వనాథస్వామి ఆలయం


సూర్యాపేటఅర్బన్: సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ప్రాచీన వైభవం గల పలు దేవాలయాలు మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి. శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం, శ్రీసంతోషిమాత దేవాలయం, పాత శివాలయంలు విద్యుత్‌కాంతులతో ముస్తాబయ్యాయి. విద్యుత్ వెలుగులతో దేవాలయాలను సుందరంగా ఆలంకరించారు. భక్తులు వేకువ జాము నుంచి భక్తులు దేవాలయాలకు పోటెత్తనున్నారు.

ఆధ్యాత్మిక కేంద్రం పిల్లలమర్రి గ్రామం



సూర్యాపేటరూరల్: కాకతీయుల కళాసంపదకు సజీవ సాక్ష్యంగా పిల్లలమర్రి దేవాలయాలు నిలిచాయి. అప్పటి రాజులు అభిరుచికి తగ్గట్లు నల్లని ఏకరాతి శిల్పంతో దేవాలయాలను నిర్మించారు. నేటి నుంచి 11 వరకు జరిగే మహాశివరాత్రి వేడుకలకు ఆలయాలను ముస్తాబుచేశారు. పిల్లలమర్రి గ్రామంలో దేవాలయాల నిర్మాణానికి ఒక కథ ప్రాచుర్యంలో ఉంది. 12వ శతాబ్దంలో కాకతీయుల రాజుల ఏలుబడిలో ఆమనగల్ ప్రాంతాన్ని బేతిరెడ్డి అనే సామంత రాజు పాలించేవాడు. ఒక రోజు రాజు వేటకు వెళ్లి అడవిలో ఉన్న పెద్ద మర్రి వృక్షం కింద సేద తీరుతుండగా చెట్టు మీద రెండు రామచిలకలు కొద్దిసేపటిలో పెద్ద గాలి, వాన వచ్చి మర్రిచెట్టు కూకటివేళ్లతో కూలిపోవునని, చెట్టు కింద ఏడు కొప్పెర్ల నిధి దొరుకుతుందని సంభాషించుకుంటున్నాయి. ఆ సంభాషణ విని అర్థమైన ఎరుకలి వాడు పక్కున నవ్వాడు. ఇదంతా గమనిస్తున్న రాజు ఎరుకలి వాడిని ఎందుకు నవ్వావని ప్రశ్నించగా చెప్పబోతున్న సందర్భంలో ఈ విషయం ఎవరికీ చెప్పవద్దని ఒకవేళ చెప్పితే తల పగిలి చస్తావని శపించి రామచిలుకలు ఎగిరిపోతాయి. రాజు ఎరుకలి వాడిని గద్దించి చెప్పకపోతే తల తీస్తానని బెదిరించాడు. అప్పుడు ఎరుకలి వాడు విషయం చెప్పినా, చెప్పకపోయినా తన చావు తప్పదని గ్రహించి రాజును తనపేరు మీద గ్రామాన్ని నిర్మించాలని కోరి ఆ పక్షుల సంభాషణను వివరించాడు. వెంటనే ఆ పక్షులు చెప్పినట్లే ఆ ఎరుకలి వాడు తల పగిలి చనిపోతాడు. వెంటనే పరిస్థితి అంచనా వేసిన రాజు అక్కడ నుంచి విశ్రమిస్తాడు. గాలివానకు మర్రిచెట్టు కూలిపోయి ఏడు కొప్పెర్ల ధనం లభించడంతో దేవాలయాలు నిర్మించారనే కథ ప్రాచుర్యంలో ఉంది. ఎరుకలివాడి పేరుమీద నిర్మించిన ఎరుకవరం గ్రామం(యర్కారం) పిల్లలమర్రి గ్రామానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉంది.

ఏలేశ్వరం దేవాలయం



నాగార్జునసాగర్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని హిల్, ఫైలాన్ కాలనీల్లో ఉన్న శివాలయాలతో పాటు జలాశయం మధ్యలో ఉన్న పురాతనమైన శ్రీకాత్యాయని సమేత ఏలేశ్వర మల్లిఖార్జునస్వామి దేవాలయాన్ని కూడా ముస్తాబుచేశారు. ప్రతీఏటా మహాశివరాత్రి రోజు మాత్రమే జలాశయం మధ్యలో ఉన్న ఏలేశ్వర మల్లిఖార్జునస్వామి గుట్టపై ఉత్సవాలను నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు తెలంగాణ పర్యాటక శాఖాధికారులు హిల్ కాలనీ నుంచి లాంచీలు నడుపుతున్నారు.

నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణోత్సవం


మాంగల్యధారణ పర్వాలు నిర్వహిస్తున్న అర్చకస్వాములు


యాగశాలలో రుద్ర హవన పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, మార్చి7: యాదగిరికొండపైన అనుబంధ శివాలయంలో గురువారం రాత్రి వేళ శివకల్యాణోత్సవం శైవాగమ పద్ధతిలో నేత్రపర్వంగా సాగాయి. శివాలయ మహామండపంలో పార్వతీ, పరమేశ్వరులను పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాలు, వజ్రాభరణాలు, వివిధ రకాల పూలమాలలతో దివ్యమనోహరంగా అలంకరించి, ప్రత్యేక సేవలో తీర్చిదిద్దారు. అలంకార సేవ, శివపార్వతుల కల్యాణ పట్టువస్త్రాలను వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాలతో తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు శివాలయ బాహ్యప్రాకార మండపంలోని కల్యాణమండపంపై అధిష్ఠింపజేశారు. సకల విఘ్నాధిపతి విఘ్నేశ్వరుడికి తొలి పూజలతో అర్చకస్వాములు కల్యాణతంతు ప్రారంభించారు. దేవస్థాన అధికారులు నూతన వధూవరులైన పర్వత వర్ధినీ అమ్మవారు, రామలింగేశ్వరుడికి కల్యాణ పట్టువస్త్రాలను అందజేశారు. పరమేశ్వరుడికి యజ్ఞోపవీతధారణ పర్వాలు జరిపిన ఆచార్యులు జీలకర్రబెల్లం, కన్యాదానం తంతు నిర్వహించారు. నిర్ణయించిన సుమూహూర్తంలో పరమేష్టి మెడలో పరమేశ్వరుడు మాంగల్యధారణ గావించారు. స్వామి, అమ్మవార్ల శిరస్సులపై ముత్యాల తలంబ్రాలను అర్చక, వేద పండితులు వేదోక్త పఠనాల నడుమ అలంకరింపజేసే ఆధాత్మిక ఘట్టాలు భక్తుల జయజయ ధ్వానాల నడుమ నేత్రపర్వంగా కొనసాగాయి. శివపార్వతుల కల్యాణ పర్వాలను దేవస్థాన ఆస్థాన పురోహితులు గౌరిభట్ల సత్యనారాయణశర్మ, శివాలయ ప్రధానార్చకులు గౌరీభట్ల నరసింహరామశర్మ, అర్చకబృందం, వేదపండితులు నిర్వహించగా, ఆలయ అనువంశిక ధర్మకర్త బీ.నరసింహమూర్తి, ఈవో రామకృష్ణారావు, ఏఈవో గజవెల్లి రఘు, పర్యవేక్షకులు సురేందర్‌రెడ్డి ఉన్నారు.

యాదగిరిక్షేత్రంలో శాస్త్రోక్తంగా రుద్ర హవన పూజలు

శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా యాదగిరిగుట్టపై శివాలయంలో గురువారం ఉదయం రుద్ర హవనం, రాత్రి వేళ శివపార్వతుల కల్యాణోత్సవ పర్వాలు శైవాగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయ ప్రధానాలయంలో కొలువుదీరిన పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరుడిని, మహామండపంలోని స్ఫటికమూర్తులను ఆరాధించారు. అర్చక బృందం, వేదపండితులు శివపంచాక్షరీ జపాలు, నందీశ్వర పారాయణం, పంచసూక్త, మూలమంత్ర జప పఠనం, వేద ఇతిహాస పరాయణాలు జరిపారు. అనంతరం యాగశాలలో ఉదయం 10గంటలకు రుద్ర హవన పూజలను పూజారులు సంప్రదాయరీతిలో నిర్వహించారు. సాయంత్రం వేళ నమక, చమక, వేద ఇతిహాస పారాయణలు, సోమకుంభార్చనలు నిర్వహించారు. ఈ విశేష పర్వాలను దేవస్థాన అర్చకబృందం నిర్వహించగా, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహుడికి ఘనంగా నిత్యారాధనలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో నిత్య పూజలు ఘనంగా కొనసాగాయి. సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపిన ఆచార్యులు స్వయంభువులను అభిషేకించి అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవాలను ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. అలంకార వెండి జోడు సేవ, సహస్రనామార్చన లు నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.14,78,613 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.

బియ్యపు గింజ పరిమాణంలో శివలింగం


బియ్యపు గింజ పరిమాణంలో శివలింగం

మర్రిగూడ, మార్చి 7: నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం తిరుగండ్లపల్లికి చెందిన శివశంకరాచారి 40 మిల్లీగ్రాముల బంగారంతో బియ్యపు గింజ పరిమాణంలో శివలింగాన్ని తయారు చేశాడు. నారోజు రామాచారి, వనమ్మ దంపతుల కుమారుడైన శివశంకరాచారి ఇంటర్మీడియెట్ వరకు చదివాడు. తండ్రి రామాచారి కార్పెంటర్ కాగా, కుమారుడు హైదరాబాద్‌లోని ఓ బంగారు ఆభరణాల తయారీ దుకాణంలో పనిచేసేవాడు. కరోనా సమయంలో స్వగ్రామంలో దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. గతంలో ఆరు గ్రాముల బంగారంతో డబుల్‌బెడ్‌రూం ఇంటిని, బియ్యపు గింజ పరిమాణంలో జాతీయ జెండాను తయారుచేశాడు. శివరాత్రి పండుగను పురస్కరించుకుని 40మిల్లీగ్రాముల బంగారంతో గంట సమయంలో బియ్యపు గింజ పరిమాణంలో శివలింగాన్ని తయారుచేసి కుడిచేతి గోరుపై ఉంచి ప్రదర్శించారు. శివశంకరాచారి కళానైపుణ్యాన్ని స్థానికులు అభినందించారు.

సాగర మాత ఉత్సవాలు ప్రారంభం

నాగార్జునసాగర్, మార్చి 7: మాచర్ల మండలం విజయపురి సౌత్‌లో సాగర మాత మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గోరంట్ల గురుశ్రీ గోపు జోసఫ్ ప్రారంభించారు. గోరంట్ల మహోత్సవాలను పురస్కరించుకొని సమిష్టి దివ్యబలిపూజ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిశుధాత్మ అయిన ఏసుక్రీస్తుకు జన్మను ప్రసాదించిన సాగర మాత(మరియమ్మ) ఆశీస్సులు ఉంటాయన్నారు. సాగర మాత మహోత్సవాల సందర్భంగా ఆలయాలను, జపమాల క్షేత్రాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. సాగరమాత విచారణ గురువుల పామిశెట్టి జోసఫ్ బాలసాగర్, గుర్రశ్రీ జోసఫ్ తంబి అన్నెంచే దివ్యబలి పూజ నిర్వహించారు. గోరంట్ల గురుశ్రీగోపు జోసఫ్చే జపమాల, స్తుతి ఆరాధన చేశారు. గురుశ్రీ గోపు జోసఫ్చే వాక్య పరిచర్య, స్వస్థతా ప్రార్థనలు నిర్వహించారు. గురుశ్రీ అల్లం చిన్న శౌరెడ్డిచే దివ్యబలిపూజ, వాక్య పరిచర్య నిర్వహించారు. అనంతరం కొవ్వత్తులతో తేరు ప్రదక్షణ, రాత్రి 8 గంటలకు సాగరమాత కళాకారుల బృందంతో సంసోను డెలీల బుర్రకథ, రాత్రి రక్తబలి బైబిల్ నాటకం ప్రదర్శించారు.

భారీగా తరలివచ్చిన భక్తులు

సాగరమాత మహోత్సవ ప్రారంభమైన గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో విజయపురి సౌత్ కళకళలాడింది. స్థానిక లాంచీ స్టేషన్ సెంటర్ నుంచి సాగరమాత దేవాలయం వరకు రోడ్డుకు ఇరువైపులా తినుబండారాల కేంద్రాలు, ఫ్యాన్సీషాపులు, ఆటబొమ్మల షాపులు వెలిసాయి. అలాగే ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఉచిత వైద్య శిబిరాలు, చలివేంద్రాలను ఏర్పాటు చేశారు.

కోతుల దాడిలో కొండెంగ మృతి

మోత్కూరు, మార్చి 7: సాధారణంగా కొండెంగను చూస్తే కోతులు భయపడి పారిపోతాయి. అందుకు భిన్నంగా కోతులు దాడి చేసి కొండెంగను చంపాయి. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరులో గురువారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న వాటర్ ప్లాంటు సమీపాన గురువారం ఉదయం కోతులు ఒక్కసారిగా కొండెంగపై దాడి చేయడంతో కొండెంగ మృతిచెందింది. చాలా సేపటి వరకు కోతులు గుంపుగా అక్కడే ఉండడంతో అక్కడికి వెళ్లేందుకు ప్రజలు భయపడ్డారు. చివరకు మునిసిపల్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి కొండెంగ కళేబరాన్ని తొలగించారు.

భూ తగాదాల్లో ఇరు వర్గాల ఘర్షణ

చింతపల్లి, మార్చి 7: భూ తగాదాల్లో ఘర్షణ కేసులో ముగ్గురిని కోర్టుకు రిమాండ్ చేశారు. కేసు వివరాలను ఎస్ఐ యాదయ్య గురువారం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని కుర్మేడు గ్రామానికి చెందిన నాదిరి వెంకటేష్, అతని పాలివారైన నాదిరి జంగయ్య, నాదిరి నర్సింహ, నాదరి శ్రీకాంత్‌లకు భూతగదాలు ఉన్నాయి. ఈ నెల 4వ తేదీన తమ వ్యవసాయ పొలం వద్ద భూ తగదాలు జరగడంతో జంగయ్య, నర్సింహ, శ్రీకాంత్‌లు కలిసి వెంకటేష్‌పై ఇనుప రాడ్డు, రాళ్లతో దాడి చేయగా వెంకటేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంకటేష్ తల్లి లక్ష్మమ్మ చింతపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారణ చేసిన అనంతరం నాదిరి జంగయ్య, నర్సింహ, శ్రీకాంత్‌లను గురువారం అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

కోదాడ రూరల్, మార్చి 7: ఆంధ్రా నుంచి కోదాడకు వస్తున్న ఇసుక టిప్పర్‌ను మండలంలోని గుడిబండ గ్రామం వద్ద పట్టుకుని సీజ్ చేసినట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి గురువారం తెలిపారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం కంచర్ల గ్రామం నుండి టిప్పర్‌లో ఇసుకను తీసుకుని గురువారం తెల్లవారుజామున కోదాడకు వస్తున్నట్లు సమాచారం అందడంతో గుడిబండ వద్ద కాపుగాసి పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. టిప్పర్‌ను సీజ్ చేసి, డ్రైవర్ గుగులోతు సైదా, టిప్పర్ ఓనర్ ఇనుపనుర్తి సుబ్బారావులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక తరలిస్తుండగా..

నేరేడుచర్ల, మార్చి 7: సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం మూసీనది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం అర్థరాత్రి పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న గరిడేపల్లికి చెందిన ప్రధాని సైదులు, ఆవుల వీరయ్య, షేక్ రాజ మహ్మద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పది మంది బైండోవర్

మద్దిరాల, మార్చి 7: సారా విక్రయిస్తున్న పది మందిని బైండోవర్ చేసినట్లు తహసీల్దార్ అమీన్‌సింగ్ తెలిపారు. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలంలోని మామిళ్లమడవ గ్రామానికి చెందిన పది మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో సారా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సారా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

మెడికల్ షాపు సీజ్

మఠంపల్లి, మార్చి 7: కొందరు మందుల దుకాణ యాజమానులు అక్రమ సంపదనే లక్ష్యంగా యువత జీవితాలను చిత్తు చేస్తున్నారు. నిషేధిత మందుల విక్రయిస్తున్న దందా యథేచ్ఛగా సాగుతోంది. సూర్యాపేట జిల్లా మఠంపల్లిలోని మందుల దుకాణాన్ని అధికారులు గురువారం సీజ్ చేశారు. మఠంపల్లి కేంద్రంగా జరుగుతున్న మత్తు మందు దందాపై అధికారులు నిఘా పెట్టారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో మఠంపల్లి మండలంలోని ప్రధాన రహదారిలో ఉన్న దుర్గ భవాని దుకాణంపై దాడి చేయగా తనిఖీల్లో పెద్ద ఎత్తున నిషేధిత మందులు లభించాయి.

కొడింగ్ పాస్పెట్ కలిగిన మందులు, టానికులను రూ.500ల నుంచి రూ.వెయ్యి వరకు విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ దాడుల్లో నల్లగొండ జిల్లా డ్రగ్ కంట్రోల్, సూర్యాపేట జిల్లా డ్రగ్ అండ్ కంట్రోల్ బృందాలు పాల్గొన్నాయి. కొంత కాలంగా కోదాడ, హుజూర్‌నగర్‌లోని పలు మెడికల్ ఏజెన్సీల ద్వారా ఈ మందులు కొనుగోలు చేస్తూ బహిరంగంగానే వ్యాపారం సాగిస్తున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు.

'కల్యాణలక్ష్మి'ని సద్వినియోగం చేసుకోవాలి : బాలునాయక్




కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, మార్చి 7: కల్యాణలక్ష్మి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని 245 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మహిళల కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఉచిత ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్‌తో పాటు ప్రతీ మహిళకు రూ.2500 అందజేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీరాములు, తహసీల్దార్ సంతోష్‌కిరణ్, ఎంపీపీ జాన్‌యాదవ్, మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, జాల నర్సింహారెడ్డి, ఎంపీపీ పార్వతితో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి


మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్, మార్చి 7: సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖలో పనిచేసే ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ 2024 డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసోసియేషన్ కేంద్ర సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి డి.ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి



చిట్యాలలో డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

● ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూరు, మార్చి 7: వేసవిలో గ్రామీణ ప్రాంతాల ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కట్టంగూరులోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేసవి దృష్టిలో పెట్టుకుని సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గానికి తాగునీటి కోసం కోటి రూపాయలు మంజూరు చేశారని తెలిపారు. ఆ నిధులను నియోజకవర్గంలో ఆరు మండలాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. అనంతరం కట్టంగూరు ఎంపీడీవోగా పనిచేసి బదిలీపై వెళ్లిన పొరెండ్ల సునీత, ఎంపీవో అథర్ పర్వేజ్‌లను శాలువాతో ఘనంగా సన్మానించారు. అంతకుముందు మండలానికి సంబంధించిన వివిధ శాఖలపై ప్రజాప్రతినిధులు, అధికారులు చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ జెల్లా ముత్తిలింగం, ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీటీసీలు మాద యాదగిరి, నాయకులు హరికృష్ణ, వల్లపు నాగలక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి, భవాని, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా మునిసిపాలిటీ అభివృద్ధి

చిట్యాల: చిట్యాల మునిసిపాలిటీని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. గురువారం చిట్యాలలో 25 లక్షలతో నిర్మించే ఓపెన్ డ్రైనేజీ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. మునిసిపాలిటీలో సీసీరోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సౌకర్యం వంటి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వం ఆర్థికపరంగా రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందని విమర్శించారు. కరువు పరిస్థితులు ఉన్నాయని దానిని ఎదుర్కోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జడ్పీటీసీ ధనమ్మ, కౌన్సిలర్లు కోనేటి కృష్ణ, జమాండ్ల జయమ్మ, జడల పూలమ్మ, జిట్ట పద్మ, బెల్లి సత్తయ్య, రెమిడాల లింగస్వామి, పాటి మాధవరెడ్డి, ఎద్దులపూరి కృష్ణ, ఏర్పుల పరమేషం, కుక్కల మోహన్, దేవనక పెద్దులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

చిట్యాలరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను కల్పించేందుకు తగిన ప్రాధాన్యతనిస్తామని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాల మండలం వనిపాకల, వట్టిమర్తి, గ్రామాల్లో రూ. 20లక్షలతో చేపట్టే సీసీ రోడ్లు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వీరేశం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాప్రభుత్వమని గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నల్లగొండ టౌన్, మార్చి 7: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని టీఎన్జీవోస్ జిల్లా ఉపాధ్యక్షురాలు రమాదేవి అన్నారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని టీఎన్జీవోస్ భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల్లో పనిచేస్తున్న మహిళలకు క్రీడా పోటీలను నిర్వహించి అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వివిధ శాఖల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళ అధికారులు, ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కొండల్‌రావు, జేఏసీ చైర్మన్ నాగిళ్ల మురళి, సెక్రటరీ ముజీబుద్దీన్, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి జె.శేఖర్‌రెడ్డి, కోశాధికారి మేడి జయరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చేపూరి నర్సింహాచారి, డాక్టర్ అరుంధతి, నాయకులు శశికళ, లక్ష్మి, రమ్యసుధ, సోమేశ్వరి, రేణుక, అనురాధ పాల్గొన్నారు.

● మిర్యాలగూడలీగల్: మిర్యాలగూడ కోర్టులో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కోర్టుల పరిధిలో పనిచేస్తున్న మహిళా న్యాయవాదులు, న్యాయశాఖ మహిళ ఉద్యోగినులకు రెండు రోజులుగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు గురువారం ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి స్వర్ణలత, మొదటి, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జీలు సుమబాల, అపూర్వరవళి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వాకిటి శ్రీనివాస్, క్రీడా కార్యదర్శి కొంక వెంకన్న, క్రీడల నిర్వాహకులు తడకమళ్ల రామరంగారావు తదితరులు పాల్గొన్నారు.



మహిళా దినోత్సవం సందర్భంగా మహిళ ఉద్యోగులకు సన్మానం



మిర్యాలగూడలో బహుమతి ప్రదానం చేస్తున్న న్యాయమూర్తి స్వర్ణలత

● వేములపల్లి: కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోనే మహిళలకు సముచిత గౌరవం లభిస్తుందని ఎంపీపీ పుట్టల సునీత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కార్యాలయ సిబ్బందితో కలిసి మహిళా ప్రజాప్రతినిధులు మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం మహిళా సిబ్బందిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, ఎంపీటీసీ చల్లబొట్ల చైతన్య, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

నేడు మిర్యాలగూడకు మంత్రుల రాక

మిర్యాలగూడ, మార్చి 7: మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మిర్యాలగూడకు రానున్నట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో కైలాస క్షేత్ర ఆవిష్కరణకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు క్యాంపు కార్యాలయానికి చేరుకుని 3.30 గంటలకు ఆలయంలో పార్వతీ పరమేశ్వరుల విగ్రహావిష్కరణలో పాల్గొంటారని ఆయన వివరించారు.

కనగల్: మంత్రి వెంకట్‌రెడ్డి శుక్రవారం కనగల్ మండలంలో పర్యటించనున్నారు. మండలంలోని దోరేపల్లి స్టేజీ నుంచి రేగట్టే వరకు రూ.27 కోట్ల నిధులతో నిర్మించనున్న డబుల్‌రోడ్డు పనులకు ఆయన పగిడిమర్రి గ్రామంలో శంకుస్థాపన చేస్తారని కాంగ్రెస్ నాయకులు గోలి జగాల్‌రెడ్డి, గోలి నర్సిరెడ్డి తెలిపారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

మిర్యాలగూడ టౌన్, మార్చి 7: తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ తెలిపారు. గురువారం కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాభావ పరిస్థితులతో భూగర్భజలాలు అడుగంటాయని, దీంతో బావులు, బోర్లు ఎండి నీటిఎద్దడి ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో ట్యాంకర్లతో నీటి సరఫరా చేసేందుకు కౌన్సిల్ సమావేశంలో నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని, వృథాను అరికట్టాలని ఆయన కోరారు. సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు : పీడీ



ఓపెన్ ఫోరంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నాగిరెడ్డి

చింతపల్లి, మార్చి 7: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవినీతికి పాల్పడితే కఠినచర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా గ్రామీణ అభివృద్ధిశాఖ అధికారి నాగిరెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట గురువారం ఉపాధి పథకంపై సామాజిక తనిఖీ ఓపెన్‌ఫోరం నిర్వహించారు. చింతపల్లి మండలంలోని 34 గ్రామపంచాయతీల్లో 2022-23 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలో వివరాలు వెల్లడించారు. మండలంలో రూ.2.63 కోట్ల పనులు చేసినట్లు తెలిపారు. అనంతరం నాగిరెడ్డి మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధిహామీలో ప్రతీ కుటుంబానికి వంద రోజుల పని కల్పించాలన్నారు. అడిగిన ప్రతీ ఒక్కరికి ఉపాధి జాబ్‌కార్డు ఇవ్వడంతో పాటు కనీస వేతనం రూ.272 వచ్చే విధంగా చూడాలన్నారు. వేసవిలో పనులు చేసేటప్పుడు కూలీలకు మంచినీటి సౌకర్యం, మెడికల్ కిట్లతో పాటు టెంట్లను కూడా ఏర్పాటు చేయాలని ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఉపాధిలో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీడీ కె.నవీన్‌కుమార్, దేవరకొండ క్లస్టర్ ఏపీడీ రవీందర్, ఈజీఎస్ ఎస్ఆర్‌పీ వెంకన్న, ఎంపీడీవో పి.సుజాత, జిల్లా విజిలెన్స్ అధికారి ఎండి.ఫయాజ్, అంబుడ్స్‌మన్ ఎండి.గౌరి, ఈజీఎస్ ఏపీవో శౌరెడ్డి, ఈసీ సుమేర్, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డు అసిస్టెంట్లు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలి : శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ స్పోర్ట్స్, మార్చి 7: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటి జిల్లాకు మంచిపేరు తీసుకొని రావాలని మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియంలో జిల్లా క్రీడాకారులకు దుస్తులను అందజేసి మాట్లాడారు. వరంగల్ జిల్లాలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు జరిగే 42వ జూనియర్ బాలుర తెలంగాణ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని జిల్లా జట్టు విజయం సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య, డీఎస్‌డీవో మగ్బూల్ అహ్మద్, కౌన్సిలర్ ఖలీల్‌పాషా, టీఎన్జీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్‌రెడ్డి, టీ.శ్రీనివాస్, రవీందర్, గిరిబాబు, ఉస్మాన్, నాగరాజు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి



ఎంపీడీవో ప్రమోద్‌కుమార్‌ను సన్మానిస్తున్న సర్పంచులు

నిడమనూరు, మార్చి 7: ఉద్యోగులు అంకితభావంతో పని చేసినప్పుడే ప్రజల్లో గుర్తింపు ఉంటుందని ఎంపీపీ బొల్లం జయమ్మ, జడ్పీటీసీ నందికొండ రామేశ్వరి అన్నారు. నిడమనూరు ఎంపీడీవో ప్రమోద్‌కుమార్ బదిలీ అయిన సందర్భంగా గురువారం శాఖాపురంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సన్మాన సభలో వారు మాట్లాడారు. ప్రమోద్‌కుమార్ ఆరేళ్లుగా ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసి అందరి అభిమానం చూరగొన్నారని, మండల అభివృద్ధికి ఎంతో దోహదం చేశాడని కొనియాడారు. ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ ఆరేళ్లుగా ఇక్కడ పని చేయడంతో ప్రజలు, అధికారు లు, ప్రజాప్రతినిధులతో ఉన్న అనుబంధం విడదీయరానిదన్నారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ బోనగిరి రమేష్ అధ్యక్షతన జరిగిన సభలో నూతన ఎంపీడీవో గుర్రం వెంకటేశం, ఏఈలు గ్రీష్మ, వరలక్ష్మి, మాజీ ఎంపీపీ అంకతి వెంకటరమణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంకతి సత్యం, మాజీ సర్పంచులు పోలే డేవిడ్, కొండా శ్రీనివాస్‌రెడ్డి, శివమారయ్య, శంకర్, రమేష్, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, లింగయ్య, మధు, కోటేష్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

దేవరకొండ: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ అన్నారు. స్పోర్ట్స్ అ సోసియేషన్, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో పట్టణంలోని డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవినాయక్, వైస్ ప్రిన్సిపాల్ రామరాజు, తాళ్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలుచేయాలి

బీఆర్ఎస్ డిమాండ్



హాలియాలో ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా, దేవరకొండ, మార్చి 7: ప్రజల నుంచి ఎలాంటి ఫీజు లేకుండా, ఎల్ఆర్ఎస్‌ను ప్రభుత్వం ఉచితంగా అమలు చేయాలని బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, రమావత్ రవీంద్రకుమార్, నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే ఎమ్మెల్యే నోముల భగత్ డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లాలోని దేవరకొండ, హాలియా పట్టణాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆర్డీవో కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిందని, ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, ట్రైకార్ రాష్ట్ర మాజీ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, నాయకులు తాటి సత్యపాల్ పిడిగం నాగయ్య, రవినాయక్, పట్టణ అధ్యక్షుడు వడ్డే సతీష్‌రెడ్డి, కౌన్సిలర్ నల్లగొండ సుధాకర్, బొల్లం రవి, బిక్షానాయక్, సురభి రాంబాబు, జానయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కూరాకుల వెంకటేశ్వర్లు, బందిలి సైదులు, లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి, వల్లపురెడ్డి, చింతపల్లి సుభాష్, కృష్ణ, రాజు, జయప్రకాష్, జానిబాబా తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

చిట్యాల: ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా చిట్యాలకు చెందిన మహ్మద్ సయ్యద్ నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో గురువారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సయ్యద్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు.

చిట్యాల: చిట్యాలకు చెందిన ఉద్యమ నాయకుడు కూనూరు సంజయ్ దాస్‌గౌడ్ గురువారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. భవిష్యత్తు కార్యాచరణ త్వరలో ప్రకటిస్తానని తెలిపారు.

మాడ్గులపల్లి: మండలంలోని చిరుమర్తి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో 4,5,6,7 తరగతుల్లో మెరిట్ విద్యార్థులకు గజ్జి నాగభూషణం ఫౌండేషన్ అధ్యక్షురాలు గజ్జి అనసూయ రూ.8300 నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రాములమ్మ, ఉపాధ్యాయులు సత్తయ్య, విజయలక్ష్మి, ప్రభాకర్, విద్యాసాగర్‌రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు గజ్జి మోహన్, సరళ, ప్రభావతి, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్): మండలంలోని రాజవరం గ్రామంలోని భ్రమరాంబిక సమేత మల్లప్పస్వామి కల్యాణాన్ని ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లా స్థాయి ఎద్దుల పందాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత (ఐఈఆర్‌సీ) కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖ కార్యాలయ అధికారి జిల్లా సహిత, విద్య సమన్వయకర్త వంగూరి వీరయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల విద్యా విషయాలు, రికార్డులను తనిఖీ చేశారు. వారి వెంట ప్రత్యేక ఉపాధ్యాయులు భాస్కర్, సూరేపల్లి త్రివేణి, శ్రీను, మంగమ్మ పాల్గొన్నారు.

మిర్యాలగూడ: తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడిగా మొండికత్తి లింగయ్య ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశంలో తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు మర్మల మల్లేష్ ధ్రువీకరణ పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ, సామాజిక అంశాలపై దండోరా క్రియాశీలకంగా పనిచేస్తుందన్నారు.

మిర్యాలగూడ టౌన్: సాగర్ ఎడమకాల్వకు నీటిని విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కోరారు. వర్షాభావ పరిస్థితులతో భూగర్భజలాలు అడుగంటాయని, దీంతో బావులు, బోర్లు ఎండిపోయాయన్నారు. ఆయకట్టు పరిధిలోని పంట పొలాలు ఎండిపోతున్న తరుణంలో వారం రోజుల పాటు ఎడమకాల్వకు నీటిని విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు ఉగ్గిడి శ్రీనివాస్, బత్తుల అంజి, పోతనబోయిన వేణు, నాగరాజు, కళింగరాజు, అజయ్ పాల్గొన్నారు.

నల్లగొండ రూరల్: మహిళా సంఘాల్లో అర్హులైన మహిళలు స్వయం సిద్ధ సంకల్ప్ దిన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ ఆలీముద్దీన్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వయం సిద్ధ పథకంలో అర్హులైన మహిళలకు గురువారం నల్లగొండ ఆర్‌బీవో కార్యాలయంలో రుణ మంజూరు పత్రాలను అందజేశారు. మహిళా సంఘాల సభ్యులకు ఎలాంటి వ్యక్తిగత పూచీకత్తు లేకుండా రూ.5లక్షల రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండలంలోని చింతకుంట్ల అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు బి.రామలింగయ్య, విజయప్రిస్కిల్లా, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మాధవరెడ్డి ఆశయాలు సాధించాలి



మాధవరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

మిర్యాలగూడటౌన్, మార్చి 7: మాధవరెడ్డి ఆశయసాధనకు కృషి చేయాలని టీడీపీ పట్టణ కన్వీనర్ వడ్డెబోయిన శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మాజీ హోంమంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి వర్ధంతి సభను పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మచ్చ సైదులు, నసీరుద్దీన్‌బాబా, చావల వెంకటేశ్వర్లు, నాగేందర్, ప్రభాకర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



ధర్నాలో మాట్లాడుతున్న పల్లా దేవేందర్‌రెడ్డి

నల్లగొండ రూరల్, మార్చి 7: నేషనల్ హెల్త్‌మిషన్‌లో పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఎన్‌హెచ్ఎం, ఏఎన్ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా అతి తక్కువ వేతనాలతో రెండో ఏఎన్ఎంలు పని చేస్తున్నారని అన్నారు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందని అన్నారు. ఇప్పటికైనా వారి సమస్యలను అర్థం చేసుకొని పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశా రు. లేకుంటే సమస్యను పరిష్కరించేంత పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కత్తుల రవికుమార్, డాక్టర్ సైదయ్య, గీతా రాణి, అన్నపూర్ణ, సరిత, అరుణ, మేరీ, హైమావతి, సునీత, సైదమ్మ, సుజాత, గీత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థల పరిశీలన

కనగల్, మార్చి 7: మండలంలోని తేలకంటిగూడెం గ్రామస్టేజీ వద్ద సర్వే నెంబర్ 1427లోని ప్రభుత్వ స్థలాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం తహసీల్దార్ బి.పద్మ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది సర్వే నిర్వహించారు. ఆ స్థలంలో సుమారు దశాబ్ద కాలంగా నివాసముంటున్న 50 నిరుపేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇస్తానని మంత్రి వారికి హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మంత్రి ఆదేశాల మేరకు అధికారులు స్థలాన్ని సర్వే నిర్వహించారు.